క్లుప్తంగా

అనాథల మధ్య షిల్లాంగ్ కలెక్టర్ బర్త్ డే వేడుకలు



నల్లజర్ల ఆనంద నిలయంలో అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేస్తున్న రామకృష్ణ

నల్లజర్ల: మేఘాలయ రాష్ట్రంలోని షిల్లాంగ్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న మండలంలోని ఆవపాడు గ్రామంలోని అచ్యుత వారి మన వడు చిట్టూరి రామకృష్ణ తన 37వ జన్మ దినోత్సవాన్ని బంధువులతో కలసి శనివారం నల్లజర్లలోని ఆనంద నిలయంలోని అనాథ పిల్లల మధ్య జరుపుకున్నారు. ఫణికుమార్ కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఉదయం, సాయంత్రం విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. నల్లజర్ల తహసీల్దార్ కృష్ణారావు, ఎంపీడీఓ సింహాద్రి, వీఆర్వో లక్ష్మణ మూర్తి, హాస్టల్ వార్డెన్ ధర్మయ్య, ఈదా డేవిడ్, సత్యనారాయణ, మోజెష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



విశేష అలంకారంలో వేంకటేశ్వరస్వామి వారు

పెరవలి: హరిహర క్షేత్రంగా పేరు గాంచిన అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం శని త్రయోదశి, శనివారం కావడంతో తెల్లవారుజాము 4 గంటల నుంచే భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు మొదలైన భక్తుల రద్దీ మధ్యాహ్నం 1 గంట వరకూ కొనసాగింది. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో భక్తులకు ఉదయం పులిహోర, చక్ర పొంగలి, దద్దోజనం పంపిణీ చేశామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ చెప్పారు.

సైన్స్ టీచర్‌కు వీడ్కోలు సన్మానం



రాఘవకుమారి దంపతులను సత్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

గోపాలపురం: మండలంలోని చిట్యాల జెడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయురాలు వాడపర్తి రాఘవకుమారి ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం జరిగింది. ఆ పాఠశాల్లో నిర్వహించిన వీడ్కోలు, సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ నున్న మురళీకృష్ణ హాజరయ్యారు. అనంతరం రాఘవకుమారి, శ్రీధర్ దంపతులను ఘనంగా సత్కరించారు. మండల విద్యాశాఖాధికారి జి.శ్రీనివాసరావు, పీతల ప్రసాద్‌బాబు, హెచ్‌ఎం శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి, కొర్లపాటి అన్నవరం, ఈలి శరత్‌బాబు, గద్దే శేషగిరిరావు, కొండేపాటి రత్నాజీరావు, మద్దిపాటి రమేష్ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపతి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఉండ్రాజవరం: చవితి సందర్భంగా వినాయక విగ్రహాల ప్రతిష్ఠకు ముందుగానే పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్థానిక ఎస్సై గుబ్బల శ్రీనివాసు స్పష్టం చేశారు. చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఉండ్రాజవరంలో శనివారం ఎస్సై శ్రీనివాసు మండంలోని ఉత్సవ కమిటీల సభ్యులకు తగు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మండపం వద్ద జరిగే చర్యలకు కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. డీజేలను పెట్టి ఇరుగుపొరుగు వారి ప్రశాంతతకు భంగం కలిగించరాదన్నారు. మండపాల పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఉండ్రాజవరం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్ అన్నారు. మండలంలోని దమ్మెన్ను గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సమానమే అన్నారు. ఎవరిపైనా వివక్షత చూపకూడదని, అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ, వీఆర్వో తణుకు శ్రీనివాసు, హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ఉండ్రాజవరం: ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణ అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉండ్రాజవరం మండలంలోని కె.సావరం గ్రామానికి చెందిన జనసేవక్ ఫౌండేషన్ అనే సేవా సంస్థ అతడి వైద్యం కోసం సేకరించిన రూ.22,600 మొత్తాన్ని అతడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేసింది.

అన్నదాతకు .. వాయుగండం

- భారీ వర్షాలకు గత నెలలో 5,354 హెక్టార్లలో పంట నష్టం
- నేటికీ అందని పరిహారం
- తాజాగా భారీ నుంచి అతిభారీ వర్షాల హెచ్చరిక
- ఎర్ర కాలువ, కొవ్వాడ జలశయాల్లోకి భారీగా వరదనీరు
- డివిజన్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- సగటున 42.3 మిల్లీ మీటర్ల నమోదు
- సబ్ కలెక్టర్, తహసీల్దార్ ఆఫీసుల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



కొవ్వూరు మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం



ఎర్ర కాలువ ఉధృతికి గత నెలలో దెబ్బతిన్న నిడదవోలు మండలం కంసాలిపాలెంలోని వరి పైరు (ఫైల్)

కొవ్వూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో మూడు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని సూచిస్తోంది. గంటకు 45 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. అధిక వర్షాలు, వాయుగుండం హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలోను, డివిజన్‌లోని అన్ని తహసీల్దార్ల కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఇప్పటికే ఈ ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరద వల్ల డివిజన్‌లోని గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో 5,354 హెక్టార్లల్లోని పంటలు దెబ్బతిన్నాయి. ఆ నష్టం నుంచి రైతులు ఇంకా కోలుకోలేదు. ఇప్పుడు మళ్లీ భారీవర్షాలు కురిస్తే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్, జూలై నెలల్లో కురిసిన అధిక వర్షాలు రైతులను అతలాకుతలం చేశాయి. ఎర్ర కాలువ వరద రైతులను కోలుకోని దెబ్బకొట్టింది. కొవ్వాడ, పేముల కాలువలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. మరోసారి వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే మరో విపత్తును ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట చిరు పొట్టదశలో ఉంది. ఈ తరుణంలో భారీవర్షాలు కురిస్తే పుప్పొడి రాలిపోయి పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

వర్షపాతం వివరాలు ఇలా..

శనివారం ఉదయం ఎనిమిదిన్నర గంటలతో ముగిసిన 24 గంటలలో కొవ్వూరు డివిజన్‌లో సరాసరిన 42.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాలవారీగా గరిష్ఠంగా నల్లజర్లలో 64.6, పెరవలిలో 61.2, ఉండ్రాజవరంలో 52.6, తాళ్లపూడిలో 42.4, నిడదవోలులో 38.2, చాగల్లు, కొవ్వూరుల్లో 32.2, గోపాలపురంలో 30.6, దేవరపల్లిలో 26.8 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. శనివారం ఉదయం నుంచి డివిజన్ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి.

పంట నష్టం ఇచ్చేదెప్పుడు...?

భారీ వర్షాలు, గోదావరి వరదల వల్ల పంటలు దెబ్బతినడంతో ఒక్కో రైతు ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడి నష్టపోయారు. పంటనష్టం అంచనాలు పూర్తయి నెల కావస్తోంది. ఇంతవరకూ ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి పరిహారం అందలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ నెలలో పంట నష్టం సంభవిస్తే అదే నెలలో పరిహారం చెల్లించేవారు. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా 5,354 హెక్టార్లలోని వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు లెక్క తేల్చారు. ఇందులో వ్యవసాయ పంటలు 4,903.99 హెక్టార్లు కాగా, ఉద్యాన పంటలు 451.48 హెక్టార్లుగా పేర్కొన్నారు. అత్యధికంగా 4,889 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నట్టుగా గుర్తించారు. డివిజన్ వ్యాప్తంగా సుమారు రూ.10 కోట్ల మేర రైతులు పంట నష్టపోయినట్టు అధికారులు అంచనా వేశారు.

ఎర్ర కాలువ జలాశయానికి వరద



ఎర్రకాలువ జలాశయం నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలంలోని కొంగువారిగూడెం వద్ద గల ఎర్ర కాలువ జలశయానికి భారీగా వరద నీరొచ్చి చేరుతోంది. ఈ జలాశయం గరిష్ట నీటి సామర్థ్యం 83.50 మీటర్లు కాగా, శనివారం ఉదయం 11 గంటలకు నీటిమట్టం 81.75 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 2,584 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని అధికారులు అంచనా వేస్తున్నారు. అనకట్టు గేట్లలో రెండింటిని ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీనికితోడు బైనేరు, జల్లేరు వంటి కొండ వాగులు ప్రాజెక్టుకు దిగువన ఎర్ర కాలువలో కలుస్తున్నాయి. ఫలితంగా క్రమంగా ఎర్ర కాలువ వరద ఉధృతి పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. గత నెలలో ఎర్ర కాలువ నిడదవోలు, నల్లజర్ల, తాడేపల్లిగూడెం మండలాల్లోని పంటలను ముంచెత్తింది. ఈ కాలువ ప్రభావంతో ఒక్క నిడదవోలు మండలంలోనే అత్యధికంగా 3,374 మంది రైతులకు చెందిన 2,360 హెక్టార్లలోని పంటకు నష్టం వాటిల్లింది. ఇలాంటి తరుణంలో ఇప్పుడు రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. మరో వైపు పోలవరం మండలం, ఎల్ఎన్‌డీ పేట వద్ద గల కొవ్వాడ కాలువ జలాశయంలో కూడా వరద నీరు క్రమంగా పెరుగుతోంది. ఈ జలాశయం గరిష్ట నీటిమట్టం 90.50 మీటర్లు కాగా శనివారం మధ్యాహ్నానికి నీటిమట్టం 89.65 మీటర్లకు చేరింది. ఈ జలాశయం నుంచి 240 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. అదీగాక భారీ వర్షాలు కురిస్తే కొండవాగులు పొంగి ప్రవహిస్తాయి. ఇప్పటికే కొవ్వాడ జలాశయంలో నీటిమట్టం దాదాపు పూర్తి సామర్థ్యానికి చేరుకోవడంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని వచ్చినట్టే దిగువకు విడిచి పెడతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కొవ్వాడ కాలువ వరదతో తాళ్లపూడి, దేవరపల్లి, చాగల్లు, కొవ్వూరు మండలాల్లో పంటలకు ముంపు పొంచి ఉంది. ఇప్పటికే ఒకసారి పంటలు నష్టపోయిన రైతులు భారీ వర్షాల హెచ్చరికలతో ఆందోళన చెందుతున్నారు.

డ్రైన్లలో పూడిక తీయకుండానే బిల్లులు

- అధికారుల తీరును నిలదీసిన సభ్యులు
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- అజెండాలోని 29 అంశాలకు ఆమోదం



తమ వార్డుల్లోని డ్రైన్లలో పూడిక తీయలేదని అధికారులను నిలదీస్తున్న కౌన్సిల్ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: గతేడాది పట్టణంలో ఎక్కడా డ్రైన్లలోని పూడిక తీయకపోయినా అధికారులు ఇష్టారాజ్యంగా బిల్లులు పెట్టుకున్నారని కౌన్సిలర్లు ఉక్కుమ్మడిగా ధ్వజమెత్తారు. నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం నుంచి చివరి వరకూ అధికారుల వైఖరిని కౌన్సిలర్లు ముకుమ్మడిగా ఎండగట్టారు. ముందుగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ రూ.96 లక్షల వ్యయంతో పట్టణంలో వివిధ అభివృద్ధి పనులను అజెండాలో ప్రతిపాదించామన్నారు. అజెండాలోని 29 అంశాలను సభ్యులు ఆమోదించారు. కౌన్సిలర్ పువ్వుల రతీదేవి అజెండాలోని ఒకటో అంశంపై అభ్యంతరం తెలిపారు. మురుగు పారుదలకు మేజర్, మీడియం డ్రైన్లలో పూడిక తీతకు బీపీఎస్, ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి రూ.32.71 లక్షలు మంజూరు చేయడంతో ఆమె అభ్యంతరం తెలిపారు. ఈ పనులకు ముందుగానే టెండర్లు పూర్తి చేశాక అజెండాలోకి తీసుకు రావడంపై ఆమె అభ్యంతరం చెప్పారు. ఈ అంశానికి సంబంధించి ప్రియాంబుల్స్ తీసుకురావాలని ఆమె పట్టుబట్టారు.అధికారులు ప్రియాంబుల్స్ తీసుకు వచ్చేవరకూ కౌన్సిల్ సభ్యులు 10 నిమిషాలు వేచి ఉన్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి సిబ్బంది ద్వారా ప్రింట్ తీసిన ప్రియాంబుల్స్ తీసుకు రావడంతో సభ్యులు మళ్లీ అభ్యంతరం తెలిపారు. ప్రియాంబుల్స్ లేకుండానే అధికారులు ప్రతి సమావేశానికి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఏఈ హేమంత్ వివరణ ఇస్తూ అన్న క్యాంటీన్, అత్యవసరంగా డ్రైన్లలో సిల్టు తొలగించాలన్న ఆదేశాల మేరకు టెండర్లు పూర్తి చేశామన్నారు. భవిష్యత్తులో ఇలా జరగదని వివరించారు. ఈ దశలో గతేడాది పట్టణంలోని డ్రైన్‌లలో పూడిక తొలగించకుండానే బిల్లులు చేసేసుకున్నారంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులపై పువ్వుల రతీదేవి మండిపడ్డారు. తమ వార్డులోని డ్రైన్లలోని పూడిక తొలగించలేదని కౌన్సిలర్లు చిలకల శారదాదేవి, దాకే అనిల్‌కుమార్, అహ్మదున్నీసాబేగం, కొత్తపల్లి సుప్రియ, ఆకుల ముకుందరావు, గుర్రం శాంతిశ్రీ , తోలేటి రూన్సీరాణి, బిర్రె పార్వతి, మొదలవలస నాగమణి, మద్దిపాటి నాగశ్రీ , ఉసురుమర్తి జాన్‌బాబు ఒక్కసారిగా అధికారులపై మండిపడ్డారు. దీంతో సిల్టు తీయకుండా ఎవరికీ బిల్లులు ఇవ్వలేదని మున్సిపల్ డీఈఈ మాధవి సమాధానం ఇచ్చారు.

వైస్ చైర్మన్ బాలరాజు ఆవేదన ..

ప్రస్తుత అజెండాలోఎస్సీ వార్డులైన చర్చిపేట, సుబ్బరాజుపేట, ఎంవీ నగర్, ఇందిరానగర్ వార్డుల్లో ఒక పనిని కూడా చేర్చలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. 13వ వార్డు ఇంద్రనగర్‌లో ఒక పనిని కూడా అజెండాలో చేర్చ లేదని గుర్తు చేశారు. ఇది చైర్మన్ చేస్తున్నారా? లేక అధికారులకు ఎస్సీలంటే చిన్న చూపా? అంటూ నిలదీశారు. దీనిపై చైర్మన్ ఆదినారాయణ స్పందిస్తూ ఎస్సీ, బీసీ, ఓసీ వార్డుల వారీగా ఎప్పుడూ చూడలేదని, ప్రాధాన్యతను బట్టి అన్ని వార్డుల్లోనూ పనులు పెడుతున్నామన్నారు. మూడున్నరేళ్ల ఈ కౌన్సిల్లో తన వార్డులో ఏ ఒక్క పని కూడా అజెండాలో చేర్చలేదని మరో ఎస్సీ కౌన్సిలర్ కౌన్సిలర్ ఉసురుమర్తి జాన్‌బాబు సమావేశం దృష్టికి తెచ్చారు. ఒకవేళ అజెండాలో పనులు పెట్టినా ఎస్సీ వార్డుల్లో పని చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. కాగా వైఎస్సార్ నగర్, వినాయక గుడి వెనుక వైపు గల అంతర్గత రోడ్లు వర్షాలకు అధ్వానంగా తయారయ్యాయని, కనీసం చప్టు వేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కౌన్సిలర్ ఎస్‌కే వజీరుద్దీన్ కోరారు. తొలుత కొత్తగా వచ్చిన కమిషనర్ టి.కృష్ణవేణికి చైర్మన్ ఆదినారాయణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఆన్‌లైన్ మోసాలపై బీ కేర్‌ఫుల్

- కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం
- లాటరీ తగిలిందంటూ సొమ్ము కాజేసేందుకు యత్నం

కొవ్వూరు: మండలంలోని వేములూరుకు చెందిన నూలు వెంకటరమణ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో లాటరీ టికెట్ కొనుగోలు చేశారు. శనివారం ఉదయం ఓ అపరిచిత వ్యక్తి ఆయనకు ఫోన్ చేసి మీకు రూ.11.78 లక్షల లాటరీ తగిలిందంటూ నమ్మబలికాడు. తాను ఎస్‌బీఐ మేనేజర్‌ను అని చెప్పాడు. వెంకటరమణను బ్యాంక్ అకౌంట్ నంబర్ చెప్పాలని, సొమ్ము జమ చేస్తానంటూ నమ్మించారు. మీరు గెలుపొందిన సొమ్ము పంపించాను. నేను పంపించే యూఆర్ కోడ్‌కు రూ.11,780 పంపించాలని ఆ అపరిచిత వ్యక్తి కోరాడు. దాంతో వెంకటరమణకు అనుమానం వచ్చి పట్టణ పోలీసులను సంప్రదించారు. వెంటనే పట్టణ సీఐ పి.విశ్వం ఆ ఫోన్ నంబర్‌కు కాల్ చేసి తాను పట్టణ సీఐని మాట్లాడుతున్నానని చెప్పగానే ఆ అపరిచిత వ్యక్తి ఫోన్ కట్ చేశారు.సైబర్ నేరగాళ్లు ఇలా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వెంకట రమణకు కౌన్సెలింగ్ చేసి పంపించారు. అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్ నంబర్ ఆధారంగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

నిడదవోలు: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ పోయిన వెంటనే అందులోని మనీ పే యాప్‌లను వెంటనే బ్లాక్ చేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ సూచించారు. పట్టణంలో ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి. ఉషారాణి, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ జె. శోభారాణి ఆధ్వర్యంలో శనివారం 'సైబర్ నేరాలు- అనర్థాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. కంబయ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి

నిడదవోలు: పట్టణంలోని గణపతి సెంటర్ నుంచి ప్రభుత్వాసుపత్రి వరకూ మాస్టర్ ప్లాన్ అమలు చెయ్యాలని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు శనివారం ఓ ప్రకటనలో మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. నగర సుందరీకరణ పేరుతో ఇటీవల స్థానిక గణపతి సెంటర్‌లోని మున్సిపల్ స్థలంలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించి మాస్టర్ ప్లాన్ అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. పట్టణంలో ఆర్వోబీ నిర్మాణం జరుగుతుండడంతో గూడెం రైల్వే గేటు నుంచి బస్టాండ్, సంత మార్కెట్, అంబేడ్కర్ చౌక్, ప్రభుత్వ ఆసుపత్రి వైపు ట్రాఫిక్ మళ్ళిస్తున్నారు. దీంతో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని చెప్పారు. తక్షణమే మాస్టర్ ప్లాన్ అమలు చేసి 40 అడుగుల రోడ్ వెయ్యాలని రాంబాబు డిమాండ్ చేశారు.

జిల్లాలో రూ.102.31 కోట్ల పింఛన్ల పంపిణీ

- మంత్రి కందుల దుర్గేష్
- ఖండవల్లిలో లబ్ధిదారులకు అందజేత



ఖండవల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పెరవలి: జిల్లాలోని 2.39 లక్షల పింఛను లబ్ధిదారులకు రూ.102.31 కోట్లను ఒక్కరోజు ముందుగానే సొమ్ము పంపిణీ చేశామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని ఖండవల్లి గ్రామంలో లబ్ధిదారులకు శనివారం ఉదయం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరవలి మండలంలోనే 10,371 మందికి రూ.4 కోట్ల 36 లక్షల 57 వేలు పంపిణీ చేస్తున్నామన్నారు. రాబోయే పుష్కరాల నాటికి గోదావరి పరీవాహక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మండల ప్రత్యేకాధికారి ఎం.సునీల్ వినయ్, ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ అచ్యుతకుమారి తదితరుల పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో వన మహోత్సవం

నిడదవోలు రూరల్: ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఒక మొక్క నాటి సంరక్షిస్తే వాతావరణంలో ఆక్సిజన్ స్థాయి పెరిగి ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం లోహియా నగర్‌లో శనివారం నిర్వహించిన వన మహోత్సవంలో మంత్రి దుర్గేష్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మంత్రి వృద్ధులకు పింఛన్ల నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, ఎంపీడీఓ పి.శామ్యూల్, తహసీల్దార్ నాగరాజు నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు: సెప్టెంబర్ నెల సామాజిక భద్రత-ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. మండలంలోని ధర్మవరం గ్రామంలోను, కొవ్వూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీల్లో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో 95 శాతం

తాళ్లపూడి: లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది శనివారం వర్షంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 7897 పింఛన్లకు గాను 7518 మందికి (95 శాతం) పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో టి.వెంకటరమణ తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీ మొదలు పెట్టారు. మలకపల్లి గ్రామంలో పింఛన్ల పంపిణీని మండల ప్రత్యేకాధికారి (డీపీవో) రాంబాబు పర్యవేక్షించారు. ఎంపీడీవో వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు వైద్య శిబిరాలు



నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆశాలత



వేలివెన్ను వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సృజని

నిడదవోలు రూరల్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు మండలంలోని తిమ్మరాజుపాలెం, సమిశ్రగూడెం గ్రామాల్లో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యురాలు కె.ఆశాలత, సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీనిధి 211 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈఓలు ఎ.రాజమోహన్, రమణ, దేవదాసు, పీహెచ్‌ఎన్ ఎమెలీయమ్మ, హెచ్‌వీ రత్నమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

ఉండ్రాజవరం: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం మండలంలో వేలివెన్ను, ఉండ్రాజవరం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. వేలివెన్నులో డాక్టర్ వై.సృజని, ఉండ్రాజవరంలో డాక్టర్ ఉషాదేవి రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాల్లో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం,ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసు, కె.సుభాషిణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సేవలు అందించారు.

కొవ్వూరు: వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో దొమ్మేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కాపవరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రణీత గ్రామంలోని 36 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. వారిలో ఐదుగురు జ్వర పీడితులను గుర్తించి రక్త నమునాలు సేకరించినట్టు వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు. సీహెచ్‌వో బీవీ లక్ష్మి, హెచ్‌వీ మేరీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పెరవలి పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌కుమార్ శిబిరంలో 56 మందిని వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆరుగురిగి జ్వరం ఉన్నట్టు గుర్తించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనంతో భారీ వర్షాలు



తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిలిచిపోయిన వర్షపు నీరు

నిడదవోలు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురుస్తోంది. శనివారం వేకువజాము 4 గంటలకు ఉరుములు, మెరుపులతో పలు గ్రామాలు దద్దరిల్లాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కలవచర్ల, అట్లపాడు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచింది. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అధిక వర్షాలు కురుస్తున్నందున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు ఎంఈఓ కేవీ గణేశ్ తెలిపారు.

తాళ్లపూడి: మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ భారీవర్షం కురిసింది. దాంతో పల్లపు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. పలు ప్రాంతాల్లోని రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లా అధికారులు సెలవు ప్రకటించడంతో పాఠశాలలు మూతపడ్డాయి. తాళ్లపూడిలోని ఆంధ్రా బ్యాంక్ నుంచి డిగ్రీ కళాశాలకు, ఆర్‌బీకేకు వెళ్లే రోడ్డు వర్షానికి ఛిద్రంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.